# ఋతుపవనం

రచన:
శ్రీ భాస్కరరాజు నాగేశ్వరరావు

చెరువు గట్టున గల రామాలయాన్ని ఆనుకొని వుండే సత్రంలో ఒక యతీంద్రుడు శిష్యసమేతంగా సంచారం చేస్తూ ఆ గ్రామానికి వచ్చి మజిలీ చేశాడు. ఆయన చాలా మహిమలు గలవాడని వూర్లోని ప్రజలంతా వెళ్ళి అయననూ ఆయన శిష్యులనూ దర్శించి ఆశీర్వాదాలు పొంది వస్తున్నారు.

మొదట ఒకటి రెండు రోజులు అవంతి పట్టించుకోలేదు. కాని తల్లీ తమ్ముడూ స్వామిని చూసి వచ్చి ఆయన గురించి గొప్పగా చెప్పగా మరునాడు సాయంత్రం స్వామిని చూద్దామని వెళ్ళింది. స్వామి, ఆయన శిష్యులు సత్రం వెలుపల గల పచ్చని చెట్లక్రింద గల అరుగులపై కూర్చున్నారు. ప్రజలు వారి చుట్టూ గుంపులుగా వున్నారు. వారిని తొలగదీసుకొని ముందుకు వెళ్ళి స్వామిని చూసి ఆశ్చర్యంతో అలాగే వుండిపోయింది. అవంతిని అంతగా ఆకట్టుకున్నది స్వామి కాదు. ఆయన చెంతనే కూర్చున్న అందమైన ఒక యువకుడు. తెల్లని దుస్తులలో అతని మూర్తి తేజోవంతంగా వుంది. అతను తమను దర్శించిన వారందరినీ సాదరంగా చూస్తూ అవంతిని కూడా చూశాడు, ఏనాడూ లేనిది ఎందుకో అతను చూడగానే అవంతి గుండెలు ఝల్లు మన్నాయి. తల్లితోపాటు తానూ స్వామి పాదాలకు నమస్కరిస్తూ ఆ యువకుడిని క్రీగంట చూసింది. ఆమె హృదయ ఫలకంపై అతని సురుచిర రూపం చెరగని ముద్ర వేసింది.

తర్వాత అవంతి స్వామిని గురించీ ముఖ్యంగా అందమైన ఆయన శిష్యుడి గురించీ సమాచారం సేకరించింది. స్వామి జన్మస్థానం శ్రీ కాళహస్తి ఆయన శిష్యులంతా వివిధ ప్రాంతాలకు చెందినవారు. ఆ యువకుడు క్రొత్తగా స్వామి శిష్య బృందంలో చేరాడు. ఇంకా సన్యాసం స్వీకరించలేదు. పేరు మధుమూర్తి,

కార్తీక మాసం ఆరంభంలో స్వామి గ్రామప్రవేశం. ఈ కార్తీక మాసం నెల రోజులూ గ్రామంలోనే గడిపి గీతోపన్యాసాలు చెయ్యాల్సిందిగా గ్రామస్తులు స్వామిని అర్థించారు. స్వామి అంగీకరించారు. ప్రతి దినమూ సాయంకాలం అయిదుగంటల నించి ఏడు గంటల వరకు గీతోపన్యాసమూ తర్వాత భజన సంకీర్తన ఏర్పాటయింది. చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా ఈ వర్తమానం అందింది. అవంతి చాలా సంతోషించింది. మరునాడు సాయంకాలం చక్కగా అలంకరించుకొని తల్లి వెంట రామాలయానికి వెళ్ళింది. ఆలయ ప్రాంగణమంతా రంగు రంగుల కాగితాల తోరణాలతో, పచ్చని ఆకులతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రజలతో ఆలయం కిటకిట లాడుతోంది. స్వామి ఎత్తయిన వేదికపై కూర్చున్నారు. మధుమూర్తి మిగతా శిష్యులు ప్రజలతో కలిసి క్రింద కూర్చున్నారు. స్త్రీలకు ప్రత్యేకించిన స్థలంలో మధుమూర్తి బాగా కనిపించేలా చేరువగా కూర్చుంది. గీతోపన్యాసాలు మొదలయ్యాయి. తర్వాత సంకీర్తనం ప్రారంభిస్తూ స్వామి మధుమూర్తిని పాడవలసిందిగా ఆదేశించాడు. మధుమూర్తి భక్త జయదేవుని అష్ట పదులలో ఒకటైన 'రాధికా కృష్ణా రాధికా, తవ విరహే కేశవా' అన్న స్వర్గీయ ఘంటసాల గానం చేసిన గీతాన్ని అందుకున్నాడు. మధుర గంభీరమైన అతని కంఠం నించి వెలువడే గీతం వాయిద్యాల మేళవింపులో చుట్టూ వాతావరణాన్ని సమ్మోహితం చేసింది. అతను పాడుతున్నంత సేపు ప్రజలంతా భక్తిపరవశులై తమ ఉనికినే మరచిపోయారు. అవంతి ఆ మధురగాన రసాస్వాదనంలో ప్రపంచాన్నే మరచిపోయింది. మధుమూర్తి తర్వాత యింకా చాలామంది భక్తి గీతాలను పాడారు.

ప్రతి దినం సాయంకాలం అవంతి రామాలయానికి వెళ్ళేది. అక్కడ వున్నంతసేపూ ఆమె మధుమూర్తిని ఆరాధిస్తూనే వుండేది. ఆమె నిర్మలమైన మానస సరోవరంలో మధుమూర్తి వినూత్న భావతరంగాలను సృష్టించాడు. ఒక్కోసారి ఉదయం చెరువునీళ్ళకని వెళ్ళి రామాలయం సత్రంలోనికెళ్ళి మధుమూర్తిని చూసేది. అతను చదువుకొంటూనో, ఇతర శిష్యులకు నిత్య కృత్యాలలో తోడు పడుతూనో కనిపించేవాడు. అవంతిని చూసి పలకరింపుగా నవ్వేవాడు. అతని చిరునవ్వులను తన హృదయంలో పదిలంగా దాచుకునేది. స్వామి శిష్య సమేతంగా రోజుకొక సంపన్న గృహస్తు యింట్లో భోజనం స్వీకరించేవారు. ఒకరోజు అవంతి యింటికి వచ్చారు. ఆ రోజు అవంతి ఎంతో సంతోషంగా గడిపింది. వంటలో తల్లికి సహాయ పడింది. అందరికీ స్వయంగా కొసరి కొసరి వడ్డిం

చింది. మధుమూర్తికి వడ్డించినపుడల్లా అవంతి అవ్యక్తానందంతో పులకించింది. సాధు సజ్జనులంటే బిడ్డకెంత భక్తో అని అవంతిని తల్లీ తండ్రీ మెచ్చుకున్నారు.

ఈ విధంగా కార్తీక మాసం అవంతి నూత్న యవ్వనపు తొలి రోజులలో ప్రథమంగా మధురానుభూతిని నింపి ముగిసింది. మరునాడు సాయంకాలం స్వామి గ్రామం విడిచి వెళ్ళిపోతున్నట్టు ప్రకటించారు. ఆ రాత్రి అవంతికి సరిగ్గా నిద్ర పట్టలేదు. మరునాటి నించి మధుమూర్తి తన నిక కనిపించడనే ఆలోచన ఆమెను అస్తిమితురాలిగా చేసింది. ఎదలోయల లోనించి అవ్యక్త వేదనా తరంగాలు ఎగసి పడుతున్నాయి. అప్రయత్నంగా విశాల వినీల నయనాలు చెమ్మగిల్లుతున్నాయి. మదుమూర్తి నిష్క్రమిస్తే తానెందుకు బాధపడాలి ? అతనికీ తనకూ ఏమిటి సంబంధం ? ఎందరు బంధువులు, స్నేహితులు తన యింటికి వచ్చి వెళ్ళటం లేదు ? వారికోసం తను కించిత్తయినా బాధ పడ లేదే ; కేవలం ఒక అపరిచితుని కోసం ఎందుకింత వేదనా రాటాలు ? అని పరిపరి విధాలుగా ఆలోచించింది. సమాధానం కన్నా అవంతికి మధుమూర్తి వియోగమే బాగా వ్యాకులం కలిగించింది.


## ప్రకటన

★

విశాఖ పట్నం జిల్లా ఎలమంచలిలో "కథాంజలి" పత్రికను విక్రయించుటకు, చందాదారులను చేర్చుటకు, ప్రకటనలను బుక్ చేయుటకూ —

శ్రీ టి. ఎస్. ఆనంద్,
డైరెక్టర్ ఆఫ్ సుభాషిణి ఆర్ట్స
(సీతా చిత్ర మందిర్)
ఎలమంచిలి - 531 005

వారిని వారి స్వంత బాధ్యతపైన నియమించి యున్నాము.


పాఠకులు, ప్రకటనదారులు శ్రీ టి. ఎస్. ఆనంద్ గారితో సహకరించ కోరుతున్నాము.

మేనేజర్
"కథాంజలి"


*.*

సురేష్ ప్రొడక్షన్స్ వారి
'శ్రీ కట్న లీలలు'
చిత్రంలో
చంద్రమోహన్, పరచూరి గోపాలకృష్ణ.

*.*



మరునాడు మధ్యాహ్నం చొరవ చేసి తమ్ముడిని వెంట పెట్టుకొని రామాలయం వెళ్ళింది. చెరువుగట్టున గల వేప చెట్టు క్రింద అరుగుపై ఒంటరిగా ధ్యాన ముద్రలోవున్న మధుమూర్తి అవంతికి కనిపించాడు. అలికిడి విని అతను కళ్ళు తెరిచి అవంతి వైపు చూశాడు. అప్రయత్నంగా అతనికి నమస్కరించింది. మధుమూర్తి ఆమెనూ, ఆమె తమ్ముడినీ ఆశీర్వదించాడు. అవంతి అతనితో ఏదో చెప్పబోయేంతలో సత్రంవైపు నించి ఒక శిష్యుడు వచ్చి స్వామి వెంటనే రమ్మంటున్నాడని చెప్పాడు. మధుమూర్తి లేచి వెళ్ళిపోతూ 'ఈ సాయంకాల ఊరి నించి వెళ్ళిపోతున్నాము. ప్రయాణ సన్నాహాలు చెయ్యాలి, సెలవు' అని చెప్పి వెళ్ళిపోయాడు. అవంతి స్తబ్దురాలై వెళ్ళిపోతున్న మధుమూర్తి వైపే చూస్తూండి పోయింది. సాయంకాలం స్వామి శిష్యసమేతంగా వెళ్ళిపోయారు. ప్రజలు ఘనంగా వీడ్కోలిచ్చారు.

ఆరు గంటలయింది. రామాలయమూ, సత్రమూ బోసి పోయాయి. మధ్యాహ్నం మధుమూర్తి కూర్చున్న అరుగుపై ఒంటరిగా, చలనం లేని పసిడిబొమ్మలా కూర్చుంది అవంతి. ఆమె దృష్టి రెండు గంటల క్రితం మధుమూర్తి నిష్క్రమించిన దారి వెంట ప్రసరిస్తోంది. గత ముప్ఫయి రోజులు ఆమెకు ముప్ఫయి నిముషాల్లా గడిచిపోయాయి. తర్వాత ప్రతి నిముషం ఒక యుగంలా నడుస్తోంది.

పక్షులు తమ నెలవులకు చేరుకుంటున్నాయి. పశువులు యిండ్లకు వస్తున్నాయి. ఒక పశువు కుర్రవాడు వేణువు వూదుతున్నాడు. అ వేణునాదం దివారాత్రాల మధ్య విరామ సంగీతంలా వుంది. అవంతి మనస్సు శూన్యమయింది. మానవ జీవితం చాలా విచిత్రమైనది. అంతకంటే విచిత్రమైనది మనస్సు. శోడషవర్షిని అయిన అవంతిని బాటసారి అయిన మధుమూర్తి బలంగా ఆకర్షించాడు. అతని దర్శనంతో అవంతిలో ప్రథమంగా స్త్రీత్వం మేలుకుంది. ప్రపంచంలో ఎన్నో ఆకర్షణలు వున్నాయి. వాటిలో కొన్ని అర్థ రహితంగా, ఆనంద రహితంగా వుంటాయి. కొన్ని మాత్రం అర్థ రహితంగా వున్నా అవ్యక్తానుభూతిని కలిగిస్తాయి. ఆ అనుభూతి మధురంగానూ, బాధాకరంగానూ వుంటుంది. అటువంటి అనుభూతే అవంతికి కలిగింది. అందుకే మధుమూర్తి నిష్క్రమిస్తే నేనెందుకు బాధపడాలి? అని ఆమెకై అమే ప్రశ్న వేసుకుంటే జవాబు ఆమెకు లభించలేదు.

ఆ నిశ్చల - నిశ్శబ్ద వాదావరణంలో అవంతి అలాగే కూర్చునే వుంది. రామాలయ ప్రాంగణంలో నించి సన్నాయి వాయిద్యం మంద్రంగా వినవస్తూ మధుమూర్తి వియోగంతో ఉద్రిక్తాలయిన అవంతి నర నరాలలో ప్రవిలయమై పోతుంది. గుడి గంటలు మ్రోగాయి. ఆ ఘంటానాదం అవంతి కర్ణ రంధ్రాలలో ప్రతిధ్వనించింది. ఆ గంభీర ఘంటానాదంలో అవంతికి హఠాత్తుగా 'రాధికా కృష్ణా రాధికా, తన విరహే కేశవా' అన్న మధుమూర్తి కంఠం మధురంగా దూరం నించి వినపడే వేణునాదంలా వినిపించింది. తన ఉనికినే మరచిపోయి క్షణ కాలం అవంతి ఆ గానాన్ని అంతర్ముఖంగా అస్వాదించింది. క్రమంగా తర్వాత బాహ్య లోకంలోకి వచ్చింది. ఆమె మనస్సు ఏదో దివ్యానుభూతికి లీనయి నట్లనిపించింది. నెమ్మదిగా అరుగుపై నించి లేచి చెరువుకట్ట దిగి గృహోన్ముఖంగా అడుగులు వేసింది.

R. K. S. KNITTINGS
TIRUPUR
Regd. No. 342215

మా ప్రత్యేక తయారింపులు : :

- 100% ఫైన్
- పాయల్ ఫైన్
- జిప్పీ ఫైన్
- మైసన్ ఫైన్
- రాకెట్ ఇంటర్ లాక్

Phone: 22016

R. K. S. Knittings
43, Cauvery St, TIRUPUR - 638 602.